క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



పాటల పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న ఆనంద్‌కుమార్, సుధ

మల్కాపురం: మహిళా దినోత్సవం సందర్భంగా 61వ వార్డులో కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో మహిళలకు ఆటలు, పాటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. వీటిలో విజేతలకు గురువారం మల్కాపురంలో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుధ, దాడి సత్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, స్వప్న, సోనూ, బూస అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డి కంచరపాలేనికి చెందిన చిటికెల దుర్గాప్రసాద్ తన తల్లితో కలిసి గవర కంచరపాలెం వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న క్రమంలో ఊర్వశి జంక్షన్ నుంచి కంచరపాలెం మెట్టు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడి కాలికి, చేతికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స అందిస్తున్నారు. తల్లి చిటికెల చిట్టమ్మ ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

ధరలు తగ్గించాలని కాంగ్రెస్ నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మల్కాపురం: నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరకులు, గ్యాస్, చమురు ధరలను తగ్గించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గొంప గోవిందరాజు, నగర సమన్వయకర్త కె.దేవి, పశ్చిమ సమన్వయకర్తలు దాకరపు నూకరాజు, పిరిడి భగత్ తదితరులు కోరారు. ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ గురువారం 60వ వార్డు గుల్లలపాలెంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. పేదలను కేంద్రం ఎలా మోసం చేస్తుందో, ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించే అంశాలపై నాయకులు మాట్లాడారు. మోదీ సర్కారు వ్యవహరిస్తున్న తీరుపై నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రజియాభేగం, సోడా సుధాకర్, మహ్మద్ అలీ, మున్న, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు జాకబ్ రాజుకు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్‌తో జాకబ్ రాజు

కంచరపాలెం: గోపాలపట్నం ప్రశాంత్‌నగర్‌కు చెందిన చిత్రకారుడు, ప్రభుత్వ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్, కిషోర్ ఫైన్ ఆర్ట్స్ అధినేత పిట్టా జాకబ్ రాజును గౌరవ డాక్టరేట్ వరించింది. అమెరికన్ యూనివర్సిటీ యునైటెడ్ నేషనల్ గ్లోబల్ పీస్ వారు బెంగళూర్ గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సంస్థ ప్రతి ఏటా సాంస్కృతిక, కళా రంగాల్లో విశిష్ట ప్రతిభ చూపిన వారి సేవలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసి సత్కరిస్తోంది. 2023 సంవత్సరానికి గానూ ఫైన్ ఆర్ట్స్(చిత్రకళ పెయింటింగ్) విభాగంలో విశాఖకు చెందిన పి.జాకబ్ రాజుకు గౌరవ డాక్టరేట్‌ను అందించింది. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

వీధుల్లోకి భారీ వాహనాలు



సుభాష్‌నగర్ వీధిలోకి ప్రవేశించిన వాహనం



వాహనాల పార్కింగ్‌తో రద్దీగా గొల్లకంచరపాలెం రైల్వే ట్రాక్ రహదారి

ఇబ్బందులు పడుతున్న స్థానికులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలోకి వచ్చే గొల్లకంచరపాలెం, తోటవీధి, సుభాష్‌నగర్, గౌరీనగర్ వీధులు తరచూ భారీ వాహనాల రాకపోకలతో కిక్కిరిసిపోతున్నాయి. భారీ వాహనాల రద్దీతో స్థానికులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. అయా ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాలు జరుగుతుండడంతో తొట్టి ఆటోలు, బొలేరో వాహనాలు వీధుల్లో ఇష్టారాజ్యంగా రాకపోకలు చేస్తుండడంతో ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఇరుగ్గా వీధుల్లోకి భారీ వాహనాలు ప్రవేశించడం వల్ల ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీస్‌లకు, ఇంటి నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

ముమ్మరంగా ఫీవర్ సర్వే

- ఫ్లూ నివారణకు ముందస్తు జాగ్రత్తలు
- ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



బాపూజీనగర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి విడదల రజిని, విజయనిర్మల, ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: రాష్ట్రంలో ఫ్లూ వైరస్ అదుపులో ఉందని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. ఈ వ్యాధి నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గురువారం 92వ వార్డులో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడుతూ ఫ్లూ వైరస్‌పై భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని, మాస్క్, శానిటైజర్ వంటివి వాడటం మంచిదని సూచించారు. అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచామని చెప్పారు. వ్యాధి నిరోధకశక్తిని పెంచేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఫీవర్ సర్వే జరుగుతోందని, మరింత ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ ఫీవర్ ఎక్కడెక్కడ ఎంతెంత శాతం ఉందో ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు నిర్వహించేలా ల్యాబ్‌లు సిద్ధం చేశామని మంత్రి తెలిపారు.

సీతంరాజుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం

జీవీఎంసీ 92వ వార్డు బాపూజీనగర్, శ్రీనుబాబునగర్, శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, విశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజినితోపాటు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొన్నారు. వారికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఘన స్వాగతం పలికారు. ఇంటింటా పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన గురించి వివరించారు. సుధాకర్‌ను గెలిపిస్తే ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎంతగానో దోహదపడతారన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షులు అప్పలస్వామి, గుణిశెట్టి శ్రీనివాసరావు, కంపర కోటేశ్వరరావు, గేదెల మురళీకృష్ణ, గొంతెన నాగరాజు, వి.గోవిందు పాలగొన్నారు.

ఆడారి ఆనంద్‌కుమార్‌కు సత్కారం..

మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితుడైన ఆడారి ఆనంద్ కుమార్‌ను మంత్రి విడదల రజిని, అక్కరమాని విజయనిర్మల, బెహరా భాస్కరరావు, స్థానిక నాయకులు ఘనంగా సత్కరించి అప్పన్న చిత్రపటాన్ని బహూకరించారు. శ్రీనుబాబు నగర్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఆనంద్‌కు అభినందనలు



ఆనంద్‌కుమార్‌ను గజమాలతో సత్కరిస్తున్న బద్రీనాథ్, సురేష్ తదితరులు

మల్కాపురం : వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఏపీ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఈ) డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించటంతో ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, పలు అనుబంధ సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పీవీ సురేష్ తొలుత శాలువా కప్పి, గజమాలతో ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, గులిగిందల లావణ్య, షిప్‌యార్డ్ వైఎస్సార్‌టీయూసీ ప్రతినిధులు చంటిబాబు, రాజాన అప్పారావు, సత్యనారాయణ, చికెన్ రాజు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌కు సన్మానం



మంత్రి అమర్‌నాథ్‌ను సన్మానిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: ఎంఎస్‌ఎంఈ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆడారి ఆనంద్ కుమార్ రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను 68వ వార్డు మిందిలో గురువారం కలిశారు. తనకు పదవి రావడానికి సహకరించినందుకు అమర్‌కు శాలువా కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. విశాఖ డెయిరీ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆలయాల ప్రారంభోత్సవం

నేడు విగ్రహాల ప్రతిష్టాపన



రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సంకల్ప పూజలు చేస్తున్న భక్తులు

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెంలో శ్రీరామా సేవా సమాజం(యాదవ్) ఆధ్వర్యంలో నిర్మించిన కోదండ సీతారామ, సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మిదేవి ఆలయాలను గురువారం శాస్త్రోక్తంగా పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు పర్యవేక్షణలో సంకల్ప పూజలు, యాగశాలలో వేదమంత్రాలతో హోమాలు నిర్వహించారు. 10వ తేదీ శుక్రవారం విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభం, దేవతామూర్తులు, కలశాల ఏర్పాటు, 11వ తేదీ శనివారం ఉదయం సీతారాములు, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణం ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. అదే రోజు భక్తులందరికీ భారీ అన్నదానం చేస్తామని చెప్పారు. గ్రామ, ఉత్సవ కమిటీల సభ్యులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

పెదగంట్యాడ: చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలని వాసవ్య మహిళా మండలి ప్రాజెక్ట్ అధికారి శ్రావణి సూచించారు. కుశాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. రాగి పిండితో చేసే పదార్థాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

దేశంలో అనేక అసమానతలు



మాట్లాడుతున్న పాలసీ స్టడీస్ డైరెక్టర్ వినోద్

సీతంపేట: భారత ఆర్థిక వ్యవస్థ సక్రమంగా లేదని, దేశంలో అనేక అసమానతలు ఉన్నాయని సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ వినోద్ వ్యాసాలు అన్నారు. 'ఈజ్ ఏ క్రిటికల్ వ్యూ ఆఫ్ ద ఎకానమీ రిలవెంట్?' అనే అంశంపై గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా ఎక్కువ మందికి పని కల్పించాలని చెప్పారు. ఐరోపా దేశాలతో పోల్చితే మన దేశంలో పన్నుల భారం ఎక్కువని, ఆర్థికాభివృద్ధికి జీడీపీ కొలమానం కాదన్నారు. ద్రవ్యోల్బణానికి కారణాలు వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ప్రసన్నకుమార్, డి.ఎస్.వర్మ, డి.వి.సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

చిల్లర దొంగలు

- పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్క్రాప్ చోరీ
- నలుగురిని పట్టుకున్న పోలీసులు
- మరో ఆరుగురి కోసం గాలింపు

మల్కాపురం: అక్కడ.. ఇక్కడ ఎందుకనుకున్నారో ఏమో ఏకంగా పోలీస్‌స్టేషన్ వద్దే చోరీకి పాల్పడ్డారు కొందరు దొంగలు. స్టేషన్ వెనుక దాచిన ఇనుప సామగ్రిని ఎత్తుకెళ్లారు. దశల వారీగా స్టేషన్ వెనుక ఉన్న స్క్రాప్‌ను దొంగిలిస్తూ చివరికి పట్టుబడ్డారు. ఆలస్యంగా విషయం తెలుసుకున్న క్రైమ్ పోలీసులు అవాక్కయ్యారు. రంగంలోకి దిగి నలుగురు దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇంకా ఆరుగురు దొరకాల్సి ఉంది. వారి కోసం గాలిస్తున్నారు. క్రైమ్ అధికారుల ద్వారా తెలిసిన సమాచారం మేరకు.. 40వ వార్డు ఏకేసీ కాలనీకి చెందిన సుమారు పది మంది యువకులు ఇక్కడికి సమీపంలోని పోలీస్‌స్టేషన్ వెనుక శిథిలావస్థలోని పోలీస్ క్వార్టర్స్‌లో తమ చేతివాటం చూపించారు. వివిధ దొంగతనాల్లో స్వాధీనపరచుకున్న ఇనుప సామగ్రి, ద్విచక్ర వాహనాలను పోలీసులు ఇక్కడ స్టోర్ చేస్తుంటారు. 2006లో ఓ దొంగతనం కేసులో స్వాధీనం చేసుకున్న సుమారు రూ. లక్ష విలువైన ఇనుప స్క్రాప్‌ను ఇక్కడ డంప్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న పది మంది దొంగలు ఈనెల 5వ తేదీ రాత్రి సామగ్రి భద్రపరిచిన గది వెనుక తలుపులు విరగ్గొట్టి స్క్రాప్ సామగ్రిని కొంత కొంత తరలిస్తు వచ్చారు. దాన్ని ఎప్పటికప్పుడు అమ్ముకుంటున్నారు. ఇది గుర్తించిన పోలీసులు వెంటనే దీనిపై విచారణ చేపట్టారు. దీనికి బాధ్యులైన వారిలో నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. మరో ఆరుగురికి ఈ దొంగతనంలో ప్రమేయం ఉందని తెలుసుకున్నారు. వారు కూడా దొరికిన తర్వాత దీనిపై కేసు నమోదు చేసి దొంగలను రిమాండ్‌కు తరలిస్తామని క్రైమ్ అధికారులు తెలిపారు.

సీతంరాజుకు మద్దతుగా ప్రచారం



60వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న బద్రీనాథ్, పీవీ సురేష్



గోపాలపట్నంలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తదితరులు

మల్కాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు పలు వార్డుల్లో గురువారం ప్రచారం చేశారు. దీనిలో భాగంగా 60వ వార్డు హనుమాన్ సంజీవ్‌కాలనీ వద్ద జరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పీవీ సురేష్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ పాల్గొని సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. 61వ వార్డు మల్కాపురం పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు దాడి సత్యనారాయణ, కొల్లి నూకరెడ్డి, బాలు, స్వప్న తదితరులు పాల్గొన్నారు. 58వ వార్డు పరిధి పలు ప్రాంతాల్లో వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొని ప్రచారం చేశారు.

గోపాలపట్నంలో..

జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో గురువారం సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం జరిగింది. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ గ్రాడ్యుయేట్లను కలుసుకుని సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు శ్రీదేవివర్మ, జియ్యాని మారుతి, ఎన్నికల పరిశీలకులు దేవి, వెదుళ్ల శ్రీను, విజయ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల సమాచారమ్

గైస్‌లో మహిళల రక్షణకు ప్రత్యేక విభాగం

ఇంటర్నల్ కంప్లెయింట్స్ సెల్ ప్రారంభం

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో వినూత్న కార్యక్రమానికి గురువారం శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా అంతర్గత ఫిర్యాదుల విభాగాన్ని(ఐసీసీ) ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ తెలిపారు. కాలేజీలో విద్యనభ్యసిస్తున్న బాలికలు, మహిళా అధ్యాపకులు తమకు సంబంధించిన సమస్యలపై ఈ విభాగంలో ఫిర్యాదు చేయవచ్చు. మహిళలు తమ సమస్యలు చర్చించుకునేందుకు ఐసీసీకి ప్రత్యేక గదిని కేటాయించారు. పెట్రోకెమికల్స్ సీనియర్ లెక్చరర్ ఎం.బోధమ్మ ఈ ఫిర్యాదుల విభాగానికి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. మహిళలను వేధించే వారిపై ఇక్కడ ఫిర్యాదు చేయవచ్చు. నేరుగా లేదా 'సబల' యాప్ నంబర్ 63026 66254కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బోధమ్మ మహిళా లెక్చరర్లు, విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఫిర్యాదులు చేసే విధానాన్ని ఆమె వివరించారు. వాటిని ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తారు. అవసరమైతే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటారు. మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నందుకు ప్రిన్సిపాల్ వెంకటరమణకు అధ్యాపకురాళ్లు, విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో ఘనంగా మహిళా దినోత్సవం



వుమెన్స్ డే వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



మాట్లాడుతున్న ఏసీపీ శిరీష

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్ ఆడిటోరియంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హార్బర్ ఏసీపీ శిరీష అతిథిగా, ఎన్‌ఎస్‌టీఎల్ తొలి మహిళా అధ్యక్షురాలు ప్రొఫెసర్ శృతి తివారీ తదితరులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా అక్కడి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బమ్మెర పోతన రచించిన ప్రసిద్ధ తెలుగు పద్యం అమ్మనుగన్న అమ్మ ద్వారా ప్రతి మహిళను దుర్గాదేవితో పోల్చుతూ వచ్చారు. ఏసీపీ శిరీష మాట్లాడుతూ అర్ధనారీశ్వర తత్వంతో లింగ సమానత్వ భావనను వివరించారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు 24 మంది



ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న మోహన్‌కృష్ణ

మధురవాడ: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీలకు విశాఖ జిల్లా తరఫున పాల్గొనే మహిళ, పురుష జట్లకు 24 మంది ఎంపికయ్యారు. మధురవాడ శ్రీకృష్ణ గ్రామర్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం మధ్యాహ్నం సంస్థ చైర్మన్ ఎమ్.మోహన్‌కృష్ణ ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా పోటీలు జరిగాయి. వీరిలో 12 మంది చొప్పున పురుష, మహిళ జట్లను అబ్జర్వర్, ఎన్ఐఎస్ కోచ్ కె.చిట్టిబాబు పర్యవేక్షణలో ఎన్ఐఎస్ కోచ్‌లు కె.కావ్య, ఐ.చరణ్ ఎంపిక చేశారు. 9వ రాష్ట్ర స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ వుమెన్ ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో లేడీస్ క్లబ్ ద్రోణ అకాడమీలో శుక్రవారం నుంచి నిర్వహించనున్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ కార్యదర్శి పి.త్రినాథ్ తెలిపారు.

రాష్ట్ర జట్లు ఇవే..

రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల జట్టుకి కె.లిఖిత, బి.రాజేశ్వరి, ఎన్.లహరి, డి.శృతిప్రియ, పి.ప్రసన్న, సీహెచ్.సాయిప్రభ, ఇ.జ్ఞానేశ్వరి, టి.లిఖిత, ఎ.జాహ్నవి, ఎమ్.జ్యోత్స్న, ఎస్.జ్యోతి, ఎస్.పూజిత ఎంపికయ్యారు. పురుషుల జట్టుకి ఎ.సంపత్, ఆకాశ్ వర్ధన్, ఎమ్.జోయల్ యశ్వంత్ కుమార్, జి.రుత్విక్, వి.దిలీప్ కుమార్, కె.కార్తీక్, కె.శివశంకర్, ఎ.జీవన్, వి.పూర్ణచంద్ర ప్రసాద్, ఎస్.రాజేష్, ఎస్.సత్యనారాయణ, కె.మనోజ్‌కుమార్ ఎంపికయ్యారు.

షిర్డీసాయి శాంతిధామంలో వార్షిక వేడుకలు



మండప అర్చనలు చేస్తున్న భక్తులు

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీసాయి శాంతి ధామం 9వ వార్షికోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఈ మేరకు ఆలయంలో గురువారం కాకడ హారతి, ధునిపూజ అనంతరం సర్వతోభద్ర మండప, నవగ్రహ మండప అర్చనలు చేశారు. పూజల్లో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ నెల 8న ప్రారంభమైన వేడుకలు 12 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బండి శ్రీనివాసరావు తెలిపారు. 10న రథోత్సవం, 11న సంకీర్తనలు, అర్చనలు, హోమాలు, 12న ఏకాదశ రుద్రాభిషేకం, చక్కెరాభిషేకం జరిపించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన, సాయంత్రం పరస ఉంటాయన్నారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సాయిబాబాను దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

కోలాహలంగా మరిడిమాంబ జాతర

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్య వలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి అనుపు మహోత్సవం ఘనంగా జరిపించారు. కొండయ్యవలసతో పాటు పరిసర కాలనీల్లో అమ్మవారి జాతరతో సందడి నెలకొంది. గురువారం తెల్లవారు జాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ, చీరలు, గాజులు సారెగా సమర్పించి, మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పాల్గొని, విశేష పూజలు చేశారు. ఆలయ కమిటీ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం అనుపు ఉత్సవం నిర్వహించారు.

దుర్గమాంబ ఆలయానికి ద్వారబంధ పూజలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో కుంచుమాంబ, దుర్గమాంబ, ముత్యమాంబ అమ్మవార్ల ఆలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. శ్రీ దుర్గమాంబ అమ్మవారి ఆలయానికి ద్వార బంధం ఏర్పాటులో భాగంగా గురువారం ద్వార బంధ పూజలు చేశారు. కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కుటుంబ సమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి ద్వారబంధాన్ని ఎత్తారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పలువురు పాల్గొన్నారు.